పోయివాడు. అయినా యింకీ పని సేయలేడంట."

ఈ పరిస్థితులకి యింత ఉద్ధృత స్థితి వస్తుందని పార్వతి ఏనాటినుంచో అనుకుంటూనే ఉంది. ఓసి నాడు ఆలస్యంగా రావడం, బస్తీ నీళ్లు బాగా పట్టుబట్టి నాగాలు మొదలెట్టడం, ఏదయినా అంటే జవాబులు చెప్పడం పార్వతి గమనిస్తూనే ఉంది.

"అదేమిటే, పాకలోంచి యిల్లు మార్చేసుకుంటున్నారా? ఎక్కడికి?"

"ఎక్కడికేటి? ఎక్కడికో - యింక మా మావ మీ తోటలో పనిసెయ్యలేడు. లోకువ వయి ఉన్నాం కదా అని సిన్నసిన్న జీతాలిచ్చి సెయ్యమంటే ఎవడు సేస్తాడు? అమ్మగారోయ్ సెప్పలేదనుకోక, రేపట్నుంచీ నేనుగాని మా పిల్లగాని పనిలోకి రాము రారా, రాముడూ" అని మహాలక్ష్మి వెళ్ళిపోయింది.

ఈ మనుషులెంత కృతఘ్నులు? ఎక్కడో పల్లెలో ఉన్నవాళ్లను తీసుకొచ్చి పనులిచ్చి, బట్టా పాతా యిచ్చి - కుటుంబమంతా భరిస్తే యిదా కృతజ్ఞత?

"అమ్మా! యిలా చూడే!" పాపాయి రెండు భుజాలమీద రెండు కుక్కపిల్లల్ని ఎక్కించి తీసుకొచ్చాడు. వెనక తోక ఆడిస్తూ తల్లి వచ్చింది. రాగానే పార్వతి చేతిని ప్రేమతో నాకడం ప్రారంభించింది. పార్వతి కుక్కపిల్లల్ని ప్రేమతో తీసుకోపోయింది అవి పాపాయి భుజాలు గోళ్లతో గట్టిగా పట్టుకుని ఊడిరాలేదు. తీసుకువచ్చిం దగ్గర్నుంచీ కుక్క ఒక్కనాడూ పాపాయిని వదలలేదు. ఇప్పుడు దాని పిల్లలూ వదలడంలేదు పూజ్యనీయమైన దాని విశ్వాసానికి పార్వతి రెండు కళ్ళూ నీళ్ళతో నిండిపోయాయి మనుషులకీ జంతువులకీ ఎంత తేడా!

అపస్వరాలు—(2)

# పదనిస

(కథానిక)

సత్యమూర్తి

మంగమ్మ రంగుచీర కట్టుకోవడం వీరన్న ఎరగనే ఎరుగడు. మంగమ్మ అలా మగదిక్కులేకండా అగ్రహారంలో అంట్లుతోమి పొట్ట పోసుకొని రోజు రోజూ ఎదుగుతూన్న వీరన్న పొట్టకూడా పోస్తోంది. వీరన్న తేగలా ఐదేళ్ళు వచ్చేవరకూ తల్లిపాలు తాగుతూనే ఉండేవాడు. "శూద్రపీనుగ" అని అగ్రహారపు ఆడంగులు విసుక్కునేవారు మంగమ్మ అంట్లు తోముతున్నప్పుడు వీరన్న తల్లిపాలు తాగుతున్నప్పుడల్లా. "నా యిష్టం" అన్నట్లు గుడ్లు మిటకరించుకొంటూ చూసేవాడు వీరన్న ఆమాట విన్నప్పుడల్లా వారివైపు. ఆ అగ్రహారంలో సైన్సు మేష్టారు పిల్లలకు అజీర్ణం తెగులు వచ్చి పాడైపోతారని నియమితంగా ఆహారం యివ్వాలని వారి కులకాంతకు బోధిస్తోండేవారు. ఆవిడకు పని తొందరమీద చిరాకుగా ఉండి వీరన్న ఆరోగ్యాన్ని, దినచర్యను ఆధారంగా చేసుకొని ఎదురు వాదించేది. వీరన్న లేచింది మొదలు పొద్దుపోయేవరకూ తల్లికూడా తిరుగుతూ పాలు చప్పరిస్తూనే ఉంటాడు. పైగా అంట్ల గిన్నెలలో పప్పు వగైరా మిగిలితే మంగమ్మ ఆప్యాయంగా వీరన్న చేతులో పెడుతుంది. లొట్టలు వేసుకొంటూ కాజేస్తాడు వీరన్న. అలా నీతీ నియమం లేకుండా వీరన్న ఆహారం తీసుకున్నా దుబ్బులా బలిసిపోతున్నాడు. వీరన్నను ఉదాహరణంగా తీసుకొని కులకాంత, వాదిస్తోంటే సైన్సు మేష్టారి విజ్ఞానమంతా మేలి ముసుగు వేసుకొనేది.

మంగమ్మ అంట్లుతోమడానికి యింటింటా తిరిగేటప్పుడు మోకాళ్ళమీద చేతులు అనుకొని వంగి ముందు బరువుమీద గబగబా గునుపు

పరుగు పెడుతుంది. వీరన్న గెంతుకుంటూ తల్లి చెంగుపట్టుకొని పరుగెడుతోండేవాడు. వీరన్న వెనకాల పరుగెడుతూ పిల్లల్ని వెక్కిరించడం, దారిలో పడుకున్న కుక్కను సాగ తీసి తన్నడం, నీళ్ళ కావిడి ఆదారి నెడుతూంటే నేకులు పట్టుకొని లాగడం యిలాంటి వెన్నో చిలిపిపనులు చేస్తోండేవాడు. మంగమ్మ మొహం జూచి ఎన్ని పాడుపనులు జేసినా ఊరుకొనేవారు. ప్రపంచంలోని ప్రతి వస్తువూ నిద్ర పోతున్నట్లు కనిపించేది వీరన్నకు. చురుకుదనం తనకే ఉన్నట్లు మిగతా ప్రాణులకు చేతనత్వం కల్పించడం తన విధి అన్నట్లు గిల్లడమో, కొట్టడమో, వెక్కిరించడమో చేస్తూ ఉండేవాడు.

ఇంగ్లీషువాళ్ళ చేతుల్లోంచి హిందూదేశాన్ని భారతీయులు లాక్కుని విజయచిహ్నంగా పెద్ద పెద్ద టీపార్టీలు, ఉత్సవాలు, మీటింగులు చేసుకొన్నారు ఓట్లకోసరం పేరుపడ్డ నాయకులంతా ఊరూరా పర్యటనలు సాగించారు. ఎవరు గెలుస్తారో అని ప్రజలు ఆత్రుతతో ఎదురుతెన్నులు చూచారు. క్రమంగా పరిపాలన విసుగెత్తి విమర్శనలు, వ్యాఖ్యానాలు, వ్యంగ్యరచనలు బయలుదేరినై. దేశం యిలా ఎత్తుపల్లాలలో పడి దడదడ లాడిపోయింది. అయినా వీరన్న మాత్రం తల్లి కడుపులో కుదుపు లేకుండా పడుకొని వేళాపాళా లేకుండా క్షీరపానం చేస్తూనే ఉన్నాడు. అంటుగిన్నెలలో పప్పు అక్షయంగా దొరుకుతూనే ఉంది. సమాజం వీరన్న వెక్కిరింపులకు గురిఔతూనే ఉంది.

వయసుకు చిన్నవాడైనా బుద్ధుడికున్నంత భూతదయ ఉంది వీరన్నకు. ఎటొచ్చీ తన్ను చూచికూడా అచేతనాల్లా పడిఉన్న జీవరాసుల జోలికిమాత్రం పోతుంటాడు. వీరన్న చేతిలో పప్పుఅంటూఏమన్నాఉంటే వీధమ్మట పోతూన్న ఏ కుక్కయినా నిరభ్యంతరంగా నాకొచ్చు. క్షుద్రజంతువు ఎంగిలిముట్టవచ్చునా? అని ఆలోచించకుండా మరోయింటికి వెళ్ళినప్పుడు కుక్కనాకిన చేత్తోటే అంటు గిన్నెలలో పప్పుతీసుకొని తినేవాడు. బుద్ధుడు, సోక్రటీసు, క్రైస్తు యిలాంటి వాళ్లెందరో అహింసావాదులున్నారు. భూతదయ వీరి నాంది సూత్రం. వీరంతా ఆ సూత్రాన్ని ఆచరించే గొప్పవాళ్ళు కాగలిగారు ఐనా కంకణం కట్టుకున్న ఈ అహింసావాదుల జీవితంలో క్షుద్ర జీవుల ఎంగిలిని అరమరిక లేకుండా స్వీకరించిన ఘట్టం కనిపించనే కనిపించదు. వీరన్నకు ప్రచారం లేకపోబట్టిగాని ఏమాత్రం ప్రచారంవున్నా అహింసావాదుల జాబితాలో అగ్రస్థానం ఆక్రమించుకొనేవాడు. శిష్ట రక్షణ, దుష్టశిక్షణ ఎవరైనా చేస్తూంటే భగవదవతారము అంటారు ప్రజలు అన్నిదేశాల్లోనూ, అన్నికాలాల్లోనూ. జాగ్రత్తగా పరిశీలిస్తే వీరన్న దినచర్యలో అలాంటి పనులు దొంతర్లు దొంతర్లుగా జరుగుతోంటాయి. బాల్యంలోనే యింత అహింసా తత్వం దైవకార్య నిర్వహణం అలవరచుకొన్న వీరన్న అగ్రహారపు ఆడంగుల దృష్టిలో "శూద్ర పీనుగ"! ఏమి చెప్పం సమాజానిదెప్పుడూ స్థూల దృష్టే సుమండీ!

కాల ప్రవాహం వీరన్న వయస్సుకు ఒక్కొక్క రోజు, ఒక్క వారం, నెల, సంవత్సరం చొప్పున కలిపివేత చేసి దిగొడితేదు పొట్ట జేనెడులోకి మారింది నున్నటి బోడి గుండు మీదున్న మమకారం పోయి వెంట్రుకలు, పాపిడిని కోరినై. "పనా పాటా వెధవకి తల్లి తెచ్చి పారేస్తూంటే తిని బద్ధాయిలా తిరుగుతున్నాడు" అని పైకే అనేస్తున్నారు కొంత మంది వీరన్న నిశ్చింతగా తిరగడం జూచి. "సంసారం దిద్దుబాటు" అనే పేరిట సమాజం నానా అవస్థలూ పడుతూనే ఉంది. పైగా వీరన్నలాంటి జరుగుబాటు మనుష్యులెవరైనా నిశ్చింతగా కాలం గడుపుతూంటే ఈర్ష్యకొద్దీ ఏవేవో పేల్తూ ఉంటారు. సంసార భారం నెత్తిన వేసుకోవలసినంత బాధ్యత యింకా వీరన్నకు రాలేదు. ఈలోగా ద్రవ్యోత్పత్తి తను కూడా చెయ్యడం అధికమయిపోతుందని వీరన్న నిగ్రహంగా జీవితం గడుపుతున్నాడు. పాపం వీరన్న మనోగతాభిప్రాయాలు సమాజానికేం తెలుస్తాయి? తన స్థూల దృష్టికి గోచరించనందున వీరన్నను "బద్ధాయి" అనేసింది.

కాలం కూడా "డెమోక్రాటిక్" సిద్ధాంతాలను తెలుసుకొంది కాబోలు వీరన్న వయ-

స్సుకు సంవత్సరాలు కలిపినట్లే మంగమ్మ వయస్సుకు కూడా సరిగ్గా అన్ని సంవత్సరాలే కలిపింది. వెంట్రుకలు కూడా కాలం ఘాటు తగిలి తెల్లబడి పోయినయ్. ఏ జబ్బూ లేకుండా నే సందకాడ తిండి తిని పడుకొని తెల్లవారేటప్పటికి ప్రాణం విడిచేసింది మంగమ్మ. "ఎంత అదృష్టమో?" అని బుగ్గలు నొక్కుకున్నారు ఇరుగు పొరుగు అమ్మలక్కలు. "వీళ్ళ మొహం తగలెయ్యా! ఒక్క అగ్రహారపు పీనుగైనా చూద్దానికి వచ్చారా అమ్మ చస్తే. బాగున్నంత సేపూ చేయించుకోడానికే. యీ కొస్త ఘటం జారిపోతే సానుభూతికైనా చూచిపోరు" అనుకున్నాడు వీరన్న. పప్పు చెయ్యి నాకిన కుక్కలుమాత్రం కృతజ్ఞతగా వచ్చి గుమ్మంలో పడి ఉన్నయ్. అవి కంట తడి పెట్టినట్లుగా కూడా వీరన్న తెలుసుకున్నాడు. అందుకు సంతోషించాడు. మళ్ళీ మానవత్వాన్ని తలుచుకొని దుఃఖించాడు. చచ్చినమనిషి విచ్చిన పండు అలా పడి వుండవుగా! దహన సంస్కారం, దినకార్యం క్రమంగా జరిగిపోయినయ్. వీరన్న అగ్రహారం వైపు వెడుతూంటే, "మంగికేం జబ్బురా వీరన్నా?" అని పలుకరించారు కొందరు ఆడంగులు. తనకు శక్తి ఉన్నంత సేపు తిట్టి పోద్దామనుకున్నాడు గాని నాలిక తొందరపడి "ఏం జబ్బూ లేదండి సందకాడ తిండి తిని తెల్లారేటప్పటికి చచ్చిపోయింది" అని పలికేసింది.

సమాజం అచేతనం అనుకున్నాడు వీరన్న చిన్నతనంలో. మంగమ్మ చచ్చి పోయింది. ఇప్పుడు చూస్తే సొంత లాభం కోసరం ఎవరి మట్టుకు వారు ఎదుటి వారిని పిండేస్తున్నట్లు, ఒకరి నొకరు శక్తి కొలది మోసం చేసుకొంటున్నట్లు గోచరించింది వీరన్నకు. ఈ స్వార్థమయ జగత్తులో బ్రతకడమే కష్టమనిపించింది. ఇంతకుముందు తినడానికే బ్రతికేవాడు వీరన్న. ఇప్పుడు బ్రతకడానికి తిండి కూడా దొరకడంలేదు. ఎంతలో ఎంతమార్పు? మంగమ్మ మరణంలోనే వీరన్న మారణం ఉత్పత్తి అయిందిగాబోలు!

పెట్టేవాళ్ళుంటే యాచన వృత్తి సుఖమే. కాని వీరన్న లాంటి గడ్డుకు ఎవ్వరూ చెయ్యి రాలపరు. పైగా "దున్నపోతులా ఉన్నావ్ పనిచేసుకుని బ్రతకరాదూ?" అంటారు. ఈ ఎగతాళి మాటలు మోసుకరావడానికి ఎంత పెద్ద జోలైనా సరిపోదు. ఇది వీరన్నకు బాగా తెలుసును. మొట్టమొదటలో వీటి అర్థం తెలిసేదికాదుగాని యిప్పుడు బాగా బోధపడుతున్నది కూలి పనికని వెడితే పనివాడి తనం చూచి పావు గంటలోనే చీవాట్లు పెట్టి పంపించేశారు వీరన్నను. ఇక వీరన్నకు చేతనైనపని ఒక్కటుంది. రిక్షా బాగా లాగ గలడు. దానివల్ల ప్రయోజనం ఏమీ కనబడదు. చిన్నప్పటినుండీ పప్పు తినడం అలవాటైన మూలాన్ని కాబోలు జాగ్రత్తగా ఆలోచించి మంచి దారికే రాగలిగాడు వీరన్న. మంగమ్మ సంపాదించిన చెంబూ, బిందె, గిన్నె, గ్లాసు అన్నీ అమ్మి సైకిలూ కొన్నాడు. ప్రయాణీకులను సైకిలుమీద ఎక్కించి తనే తీసుకెడుతూండేవాడు. పొట్ట కూటికి లోటులేకుండా కాలం దొర్లిపోతూండేది

ఎంత జాగ్రత్తగా ఉన్నా రోజులు బాగులేకపోతే మహాకష్టం. వీరన్న సైకిలు బయట పెట్టి బట్టల కొట్టులోకి వెళ్ళేడు. అలవాటుగా చేసిన పనే అది. పావు గంటలోనే తిరిగి వచ్చేడు. పాపం తనకన్నా దరిద్రుడెవడో దాపురించాడు. సైకిలు లేదు. వీరన్న కొట్టు తలుపుకు జార్లబడిపోయాడు. నడవలేక పోయాడు సరిగదా నాలిక కూడా వెనక్కు చుట్టుకపోయింది. వీరన్న ఇంత మగ్గిపోతున్నా బజారు పనులు మామూలుగానే జరిగిపోతున్నాయి. కార్లూ, సైకిళ్ళూ అన్నీ మామూలుగా తిరుగుతూనే ఉన్నై. వీరన్నకు సైకిలు ఆనవాలు బాగా తెలుసు. అయినా రెండు మూడు సైకిళ్ళు వీరన్నను కంగారు పెట్టినై. సమీపించి నిరాశతో కూలబడిపోయాడు వీరన్న. ఓపినంత సేపూ తిరిగాడు. అంత విశాలమైన పట్నంలో అన్ని సైకిళ్ళలో తన సైకిలు కనబడనే లేదు. విసిగి ఆఖరు యత్నంగా పోలీసు స్టేషనుకు వెళ్ళేడు. సైకిలు ఆనవాళ్ళు, వీరన్న చిరునామా వ్రాసుకొని వెళ్ళమన్నారు పోలీసువాళ్ళు ఆకలి, నిద్ర పలాయనం చిత్తగించాయి వీరన్ను నుంచి. తాలింపు వాసనలు

ఆఘ్రాణిస్తూ కాఫీహోటలు దగ్గర వెర్రిగా ఆలోచించుకొంటూ కూర్చున్నాడు వీరన్న. సైకిళ్లు చాలా ఉన్నాయి హోటలుకు ఎదురుగా. వీరన్న సైకిలు ఎంత చూచినా కనబడదు. సైకిళ్ళమీద పేరు లెక్కడున్నై? అంతా ఊహ-యిది వీరన్నది అది వెంకన్నది అని. అంతా వట్టి కల్పన. వీరన్న సైకిలు ఏవరో ఆకాశ రామన్న తీసుకపోతే వాడి కూడా పోయింది. హోటలు కెదురుగా ఉన్న సైకిలు ఏదైనా వీరన్న ప్రయత్నిస్తే ఎరమెరిక లేకుండా వచ్చేస్తుంది. తనకు బాగా సైకిలు తొక్కడం చేతనవును. ఒకళ్లిద్దరు వెంటబడ్డా దొరకడు. తన సైకిలు పోయింది. జీవనోపాధి పడిపోయింది. హోటలు కెదురుగా ఉన్న సైకిళ్ళు భోగులవి. ఒక్క సైకిలు పోయినంతలో వాళ్ళ జీవితాలలో చెప్పుకోదగ్గ మార్పు ఏమీరాదు. ఇలా సైకిలు పోయింది జీవనోపాధి పడిపోయింది అని చెప్పుకుంటే వాళ్లు సైకిలు యివ్వరు. ఆకాశరామన్న తనలాంటి బీదవాడి సైకిలు అడిగే పట్టుకెళ్ళేడా? అలాంటప్పుడు తన కెందుకా సంశయం? ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించుకొనే లేచి వెళ్లి సైకిలు తీసి పట్టుకొని ఎక్కబోయాడు వీరన్న. ఇంతలో కలవారు బయటకు వచ్చి కేకలు పెట్టేరు. వీరన్న తొక్కడం మాత్రం మానలేదు. ఎదుటి సెంటరులో నిలబడ్డ పోలీసుకు వీరన్న పట్టుబడ్డాడు. పోలీసు వెంటనే సైకిలు కలవారినీ కాజేసిన వాడినీ వెంటబెట్టుకుని పోలీసు స్టేషనుకు తీసుకవెళ్ళేడు. సైకిలు దొంగతనానికి శిక్ష వీరన్నకు తెలుసు. అందుకే తన సైకిలు పోయింపని వెదకి వెదకి చివర పోలీసువారికి తెలియజేశాడు. పోలీసు వెనకాల బుర్ర వంచుకుని నడుస్తూ ఏమేమో అనుకుంటున్నాడు వీరన్న.

"ఇదేమంచిది తనకు జీవనోపాధి లేనందుకు" అనుకుంటున్నాడు గాబోలు. ప్రభుత్వంవారు వీరన్నకు అజన్మాంతర కారాగారవాసశిక్ష విధించి జీవనోపాధి కల్పింతురుగాక! కనీసం ఆ ఆశీర్వచనమైనా ఫలిస్తుందని వీరన్నకు నమ్మకం లేదు.

# కొరియాలో ఐక్యరాజ్య సమితి సేనలు

అమెరికా విదేశాంగ మంత్రి డీన్ అచిసన్ కొరియాలో సమితి సేనల గురించి ఒక ప్రకటన చేశారు. మొన్న గురువారంనాడు చేసిన ఈ ప్రకటనలో అచిసన్ ఇలా అన్నారు

"కొరియాలో యుద్ధ విరమణ సంప్రతింపుల సందర్భంలో, అచటి విదేశ సేనలన్నీ వెంటనే ఉపసంహరింపబడవలెనని కేసాంగ్ లో కమ్యూనిస్టు ప్రతినిధులు కోరారు. ఈ విషయం రాజకీయమైనది గనుక, మేము ఆ విషయంపై ఏమీ చెప్పజాలమనీ, ఐక్యరాజ్య సమితీ, వివిధ ప్రభుత్వాలు మాత్రమే దానికి సమాధానం చెప్పవలసి ఉంటుందనీ ఐక్యరాజ్య సైన్య ప్రతినిధులు వారికి జవాబు చెప్పారు.

"ఈ విషయం సైనిక సంబంధమైనదా, లేక రాజకీయాలకు సంబంధించినదా అనే విషయంపై సిద్ధాంత రాద్ధాంతాలు అనవసరం. ఐక్యరాజ్య సమితి ఆదేశించినందున, కొన్ని దేశాల ప్రభుత్వాలు తమ సైన్యాలను అక్కడికి పంపించినందువల్ల ఐక్యరాజ్య సమితి సైన్యాలు నేడు కొరియాలో ఉండటం తటస్థించింది. దురాక్రమణ పరులను తిరుగకొట్టి, ఆ ప్రాంతంలో శాంతి, భద్రతలను ఏర్పరచడంకోసం ఆ సైన్యాలు అచటికి పంపబడినవి.

"కనుక, వాస్తవమైన యుద్ధవిరమణ జరిగినప్పటికీ, నిజమైన, శాశ్వతమైన శాంతి ప్రతిష్ఠితమై కొరియా ప్రజలు దండయాత్రా భీతి లేకుండా స్వేచ్ఛగా తమ భవిష్యత్తును తాము తీర్చి దిద్దుకోగల పరిస్థితి ఏర్పడేటంత వరకు ఐక్యరాజ్యసమితి సైన్యాలు అక్కడ ఉండి తీరాలి.

"అలా కొరియాలో నిలవ ఉండవలసిన సైన్యాల పరిమాణం. అనంతర పరిస్థితులపైన, ముఖ్యంగా యుద్ధవిరమణ సంధి షరతులు అమలు జరిగే పద్ధతిపైన ఆధారపడి ఉండగలదు.

('యూసిస్" నుండి)